కన్నీళ్లు తుడుచుకున్నాడు రాజు యూనివర్శిటీ కాంటీన్‌లో.

గోపాలం సానుభూతిగా చూశాడు. "ఎప్పుడు జరిగిందండి? అరే!"

"నిన్న ఆర్ట్సు కాలేజీముందు." తల వంచుకున్నాడు రాజు.

"ఇంకా ఏమంది?"

"నేను విలన్నిట! నిజం చెప్పండి. మీరు నన్ను రెండేళ్లబట్టి చూస్తున్నారు. కంబైన్డ్ క్లాసుల్లో ఎప్పుడన్నా గల్లంతు చేసేవాణ్ణా?"

"ఛీ. మీరా క్లాసుల కెప్పుడు వచ్చారు, పాపం."

రాజు కోపంగా చూసి మళ్లీ మామూలు ధోరణితో పడ్డాడు. "చూడండి, గోపాలంగారూ. ఇన్నేళ్లూ బతికి ఇంటి వెనకాల చచ్చినట్లుంది నా పరిస్థితి. అసలు దమయంతి ఇంట్లోనే ఏదో తెలిసినవారు, స్నేహితులు మీరు అద్దెకు ఉంటున్నారని తెలిసి . . ."

"సావాసం చేశారు."

"దమయంతి ఇంత అల్లరి పెడుతుందనుకోలేదు. మీరు కాస్త . . ."

"ఫర్వాలేదు. చెప్పండి."

"నా క్షమాపణలు ఆవిడికి తెలియచేయండి. ఇంత అందంగా ఉన్నారు కనకనే ఆయ నలా ప్రవర్తించారని . . ."

"చెప్పమంటా రంతేగా?"

"చెప్పడంకాదు, నాకు మీరు కాస్త సాయం. . . మీ మేలు ఈ జన్మకి. . ." దీనంగా చూశాడు రాజు.

"దానిదేముంది? మనిషికి మనిషి సాయం చేయకపోతే ఎలా. బిల్ ఏదండి?"

"బలేవారండి. మీరు బిల్ ఇవ్వడం ఏమిటి? ఇంకో డ్రింక్ తాగరూ? పైనాపిల్ ఇవాళ చాలా బావుందిట."

• • •

రామక్రిష్ణా మిషన్‌దగ్గిర సముద్రాన్ని చూస్తూ తల పట్టుకున్నాడు రామారావు. "అవును, గురూ. పుట్టినప్పటినించీ ఎవరిచేతా పల్లెత్తుమాట పడలేదు. ఇవాళ్టికి ఇందులో పడి ఈ చేతగాని బతుకు చాలించమదా మనిపిస్తూంది."

గోపాలం నిట్టూర్చాడు. "హవ్వాయిచెప్పు అన్నావుగా. కొంత నయం. కొట్టినప్పుడు ఎవరూ చూడలేదన్నావుగా. చావవలసిన పనిలేదు. నువ్వుగాని చచ్చిపోయిఉంటే ఆ అమ్మాయి ఈపాటికి పిచ్చాసుపత్రిలో సంగీతం నేర్చుకుంటూఉండేది. ఇంతకీ ఆ ఇంతి పేరు?"

రామారావు కొంచెంసేపు సిగ్గుపడి చటుక్కున ఆకాశంకేసి చూస్తూ, "దమయంతి. వలపుల పూబంతి. చాయలో ...మంతి. ఇంకేమని చెప్పను, గురూ. కొండంత స్నేహితుడివి నువ్వున్నావు. నన్నా ఒడ్డున పడేయకపోతావా అన్న ధైర్యంతోనే బతుకుతున్నాను. ఆ అమ్మాయి ఇంట్లో ఆశ్రయం సంపాదించుకున్నావు. ఆమె హృదయంలో నా కాశ్రయం కలిగించవూ?"

గోపాలం మాట్లాడలేదు.

"న్యూటన్ భూమికి ఆకర్షణశక్తి ఉందన్నాడు. దమయంతివంటివాళ్లు భూమిమీద ఉంటే ఎందుకుండదు. అయిన్‌స్టీన్ సన్నా దమయంతినీ ఊహించే

ప్రేమించే హక్కు ప్రతి కుర్రాడికీ ఉన్నట్లే మెత్తని చెప్పుతో మందలించే హక్కు అతగానిచేత ప్రేమించబడిన కుర్రదానికీ ఉంటుంది. ఎంత అందగత్తె అయితే మాత్రం ఒకే అమ్మాయిని ఎందరు పోటీపడి ప్రేమించేసి, మంచాన పడతారుట! ఈ ప్రేమరోగుల్ని ప్రేమించేయటమే అమ్మాయిల పనా! అస్సలు, అందమైన అమ్మాయి ప్రేమించేది, తన వెంటబడి, మతులు పోగొట్టుకునే మతిహీనుల్ని కాదు. తనను, తన అందాన్ని అలక్ష్యంచేసే ధీరోదాత్తుల్ని — ఈ రహస్యం ఎందరికి తెలుసు?

రెలిటివిటీ థియరీ చెప్పాడు."

"సరేలే. రా, పోదాం." గోపాలం లేచాడు.

"ఆ నోటిపలుకు మెలొడీ ఆఫ్ మాండొలిన్. గాడెస్ ఆఫ్ ఫ్లోరా, గురూ, ఆవిడ."

"సరేనన్నాగా. రా మరి."

• • •

అవుట్ గేటుదగ్గిర బస్సుకోసం నిలబడిన గోపాలానికి పరిగెత్తుకుంటూవస్తూన్న శేషగిరి కనిపించాడు.

"బస్సు ఇంకా రాలేదులే. ఎందుకు పరిగెత్తుకు వచ్చావ్?" గోపాలం అడిగాడు.

"బస్సుకోసంకాదు . . ." రొప్పు తీర్చుకుంటూ మాట పెగల్చుకోసాగాడు శేషగిరి. "మనిద్దరం ఒకటే రూములో రెండేళ్లు గడిపిన మాట నిజమేనట్రా, గోపీగా."

"రెండేళ్లపైన పద్నాలుగురోజులుగాని, ఏరా శేషమ్మా, మధ్యాహ్నం క్లాసు ఎగ్గొట్టావేం కథ?"

"ఇక ఈ క్లాసులు, చదువులు మానేయదల్చుకున్నాను."

"మీ నాన్నగారి అడ్రస్ నా దగ్గిరుంది, శేషమ్మా!"

"నాకు లెక్కలేదు. ఈ చదువు చదివి ఎవర్ని ఉద్ధరించను? ఇక్కడ ఉన్నప్పటినించి మరీ దిగులు పెరుగుతూంది. నే నెంత చెప్పినా వినకుండా హాస్టల్నీ, మమ్మల్నీ అందరినీ వదిలిపెట్టి బైటికి పోయావు. హాయిగా ఇంటికి పోయి వ్యవసాయం చేసుకుంటాను."

"అలాగే. బస్తాకి ఎన్ని మరకాలు?"

"అది థియరీ. మనదంతా ప్రాక్టికల్ సైడు. అయినా తెలుసులేరా పెద్ద, పదహారు . . . అవును దమయంతి వయసుకూడా పదహారే అయిఉంటుంది."

గోపాలం నీరసంగా శేషగిరిని చూసి, "ఏ దమయంతి?" అని అడిగాడు దిగాలుగా.

"తెలియదా? నీకు తెలియదా? నేనుండే గది గోడలకు తెలుసునే ఆ విషయం. నేను మోసే పుస్తకాలకి తెలుసునే ఆ విషయం" అని ధోరణి మార్చి అనుమానంగా గోపాలాన్ని చూసి, "అయినా నువ్వు

## దావెళ్ల రాఘవేంద్రరావు

పెర్లిన్ షర్టు కుట్టించి, వాళ్ళ డాబామీదే ఉంటూ దమయంతి తెలియదంటావా? అన్యాయం. ఈ ఏడాది వచ్చిన జూనియర్ కుర్రాళ్లకికూడా తెలుసే దమయంతి ఎవరో. నువ్వు రెండేళ్లపాటు నా రూమ్మేటుగా ఉండి ఇలా అంటున్నావంటే నాకు సిగ్గుచేటుగా ఉంది. నీ చొక్కా చిరిగిపోను! నిన్ను చంపేసినా పాపంలేదు."

"ఒక పదిరూపాయిలు అప్పిచ్చి తరవాత చంపేయి." నవ్వాడు గోపాలం.

శేషగిరి జేబులోనించి పదిహేను రూపాయిలు తీసి గోపాలం జేబులో పెట్టి తన చేతిలో ఉన్న పాకెట్‌కూడా గోపాలం చేతుల్లో పెట్టి "జాగ్రత్తగా విను. నా గళ్ల చొక్కా కొన్నాళ్లపాటు నీకు అప్పిస్తున్నాను. అది తొడుక్కుని అప్పుడప్పుడుఆరెండుకళ్లకీ కనిపిస్తూండు. 'చొక్కా బాగుందే!' అంటుంది. తడుముకోకుండా నా మాట చెప్పచ్చును నువ్వు. పోతే, ఈ దువ్వెన తీసుకో. ఎప్పుడయినా ఆవిడికి కనిపించేలా కింద పారవెయ్యి. దీన్ని భద్రపరిచినట్లే ఆమె నా హృదయాన్ని కూడా భద్రపరిచే రోజు రాకపోదు. తెలిసిందా? బస్సు వస్తూంది. అదుగో, వెళ్లు. ఆర్ట్సు కాలేజీ దగ్గిర ఇదే బస్సు దమయంతి ఎక్కబోతుంది. మిత్రద్రోహం మహాపాపం. మరిచిపోకు."

"నువ్వు రావా?"

"వద్దు. ప్లాను చెడుతుంది. జాగ్రత్త. మరిచిపోకు. దువ్వెన భద్రం."

ఎల్లమ్మతోటదగ్గిర బస్సు దిగి గబగబా దమయంతిని దాటి నడవసాగాడు గోపాలం. తల వంచుకుని ముందు పోతున్న మానవుణ్ణి గుర్తుపట్టింది దమయంతి. కాస్సేపటికి మానవుడి చేతులు ఏదో వస్తువును జారవిడుస్తున్నట్లు లీలగా తోచింది ఆమెకు. పది అడుగులు ముందుకు వెళ్లాక ఆమెకు ఒక అందమైన దువ్వెన కనిపించినది.

ఆ మరునాటి సాయంత్రం గోపాలం ఇంటికి టెలిగ్రాంలాంటి ఉత్తరం వ్రాశాడు.

"నాన్నగారికి నమస్కరించి వ్రాయునది . . . ఆర్డరు ఇచ్చిన స్కూటరు వచ్చింది. ధాన్యం అమ్మి మూడువేల అయిదువందలు మీరు వచ్చి ఇచ్చినాసరే, నన్ను రమ్మన్నాసరే. ఈ ఏడాది మాకు పరీక్ష లుండవు. మారిన అడ్రసు కింద వ్రాస్తున్నాను. సబ్బిడరీస్ అన్నీ పాసయినాను. ఇంతే సంగతులు — గోపాలం."

• • •

"ఏయ్, దమయంతీ, ఆగవోయ్." పిలిచింది రమ యూనివర్శిటీ బస్సులోనుంచి దిగి వస్తూ.

దమయంతి ఆగి నిలబడింది. రమ దగ్గిరికి వచ్చి చిన్నగా నవ్వింది. "ఏమిటోయ్, చేరి నెలరోజులైందో లేదో పెద్ద రివల్యూషన్ తెచ్చేస్తున్నావట. మొన్న ఆ ఫిజిక్సు రామారావుని చెప్పుతో కొట్టావటగా! ఈమధ్య హాస్టల్లో నీ పేరుతప్ప మరేం వినపడటం లేదు."

దమయంతి నవ్వి ఊరుకుంది.

"ఆ బోటనీ రాజునుకూడా మొహం వాచేలా చివాట్లు పెట్టావటగా!"

దమయంతి మళ్లీ చిన్నగా నవ్వి ఊరుకుంది. ఇద్దరూ ఆర్ట్సు కాలేజీకేసి నడవసాగారు.

ఓ జీడిమామిడిచెట్టుకింద నిలబడ్డ నలుగురు

# అనార్కలీ పక్కన అరటిమొక్క



క్కు(రాళ్ళు పళ్ళికెని రాసాగారు.

"అరుగో, తయారు. ఈ సైన్సువాళ్ళు రోజూ ఆర్ట్సు కాలేజివద్ద చేసే రాచకార్య మేమిటో?" అంది రమ.

"రోజూకన్న ఇద్దరి సంఖ్య తగ్గిందే."

"ఎవరు రాజా — రామారావులా? ఆ రెండువికెట్లు పడిపోయాయిగా. వాళ్ళు క్లాసులకుకూడా వెళ్ళడం లేదుట. బోటనీ ఉషాబాల చెప్పింది."

"అనార్కలీ పక్కన అరటిమొక్క!" వెనకనించి ఈలలు; నవ్వులు..

రమకు కోపం, దుఃఖం, ఆపైన కన్నీళ్ళు వచ్చాయి. రమని ఓదార్పుగా చూసి దమయంతి కోపంగా వెనక్కి తిరిగి, "సలీమ్ అ(డస్ ఏమిటే?" అడిగింది. అంతే. నలుగురూ తలలు వంచుకుని వాళ్ళని దాటి అక్కణ్ణించి వెళ్ళిపోయారు. రమ కళ్ళు తుడుచుకుంది.

"పదవోయ్. ఇక ఈ మంద మన జోలికి రాదులే." దమయంతి వచ్చి రమ భుజంమీద చెయ్యి వేసింది.

కొత్త స్కూటర్‌కి స్టాండ్ వేసి తం(డిని తీసుకుని హాల్లోకి వెళ్ళాడు గోపాలం. రామాయణం చదువుతున్న శాంతమ్మగారు కళ్ళజోడు తీసి గోపాలంవెంట సిగిరెట్ కాల్చుకుంటూవస్తున్న దశరథంగారిని (ప్రశ్నార్థకంగా చూసి తరవాత కించిత్తు కోపంగా గోపాలంవంక చూసింది.

"మా నాన్నగారండి." బాగుండదేమోనని గాభరాగా చెప్పాడు గోపాలం.

శాంతమ్మగారు చేటంతమొహంతో లేచి మర్యాదగా అన్నారు: "రండి! ఎండలో వచ్చారు. కాస దాహం

పుచ్చుకుంటారా, అన్నయ్యగారూ?''

దశరథంగారు మెట్లెక్కడం మానేసి, ''ఇప్పించండమ్మా!'' అని వచ్చి ఓ కుర్చీలో కూర్చుని పైకండువాతో ముఖం తుడుచుకుని చొక్కాలోకి గాలి ఊదుకోసాగారు. గోపాలం అసహనంగా తండ్రిని లోలోన విసుక్కుంటూ నిలుచున్నాడు. శాంతమ్మగారు వెళ్లి కుంకపాటి చెంబుడు మజ్జిగ తెచ్చి గ్లాసులో పోసి ఆయన కివ్వడం మొదలుపెట్టారు. రెండుగ్లాసులు పూర్తిచేసి, ''చాలమ్మా. బయట ఎండన్న మాటేగాని ఈ ఊళ్లో ఇళ్లలో చల్లగానే ఉంటుంది. సముద్రపు గాలి కదూ?'' అన్నా రాయన తేన్చుతూ.

''అదే చల్లదనంలెండి. మీది కృష్ణాజిల్లా కదూ?''

''అవునమ్మా!''

''బెజవాడదగ్గిర . . .''

''గుడివాడదగ్గిర . . .''

''నా మతి మండిపోను! అబ్బాయి చెప్పాడుకూడాను. గుడివాడదగ్గిర పామర్రు. . .''

''అదే . . . పామర్రుదగ్గిర పసుమర్రు లెండి!''

''అలా చెప్పండి. పసుమర్రా మీది? ఆ ఊళ్లో మా బంధువులుకూడా ఉన్నారు. సుబ్బరామయ్యగారని తెలుసా మీకు?''

''ఎవరు? ఆ ధాన్యపుమిల్లు సుబ్బరామయ్యేగా? తెలియకేమండి? మా కయినవాడేగా! స్వయానా మా పిన్నమ్మ అల్లుడేగా వాడు!''

''సరిసరి. అయితే సీతమ్మపిన్నిగారి మనవడికా గదిఇచ్చి అద్దె పుచ్చుకుంటున్నాను! నామతి మండిపోను!''

''చెప్పరేం, మరి! సోమిదేవమ్మ పిన్నిగారమ్మాయి విశాఖపట్టణంలో ఉందని తెలుసుగాని మావాడు తిన్నగా మీ ఇంట్లోనే మకాం పెట్టాడని నాకేం తెలుసును. మనం ఎప్పుడో చిన్నప్పుడు కలుసుకున్నాం. మీ ఆయన కాశీపతి ఇటుకేసి వచ్చేసి వ్యాపారం పెట్టాక మిమ్మల్ని కలుసుకోవడం పడనేలేదు. పోల్చుకోలేకపోయాను.''

''ఆ వ్యాపారమే ఆయన ప్రాణాలు తీసింది. అస్తమానూ అదే ధ్యాసలో పడి తిండితిప్పలు తినక గుండెజబ్బుతో, ఇదుగో, మమ్మల్ని ఇట్లా వదిలేసి ఆయనదారిని ఆయన కాస్తా వెళ్లిపోయారన్నయ్యా!''

''సీతమ్మపిన్నిగారి పిల్లలు మీ సంగతి చెబుతూనే ఉంటారు. అన్నట్లు నీకో కూతురు ఉండాలి కదూ. ఏది?''

''కాలేజీకి వెళ్లిందన్నయ్యా. సాయంత్రం వస్తుంది.''

''ఏం చదువుతూందేమిటి అమ్మాయి?''

''అదేమిటో ఆనర్సట. ఈ ఏడాదే యూనివర్శిటీలో చేరింది.''

''అయితే మావాడికి తెలిసేఉండాలి. ఏరా?''

''ఇంగ్లీషు లిటరేచర్ ఆనర్స్, నాన్నా.''

''పనిమీద వచ్చావా అన్నయ్యా?'' అడిగింది శాంతమ్మ.

''పనిలేదు, చట్టుబండలూలేదు. ఇదుగో వీడు స్కూటర్, స్కూటర్ అని గోలచేస్తే, సరే అని డబ్బు తీసుకువచ్చాను.''

''పోన్లే అన్నయ్యా. నీకు ఒక్కడే కదా కొడుకు! ఆమాత్రం ముచ్చట తీర్చకపోతే ఎట్లా?''

''మరి నీకూ ఒక్కతే కదా కూతురు. నీ కూతుర్ని ఎంత గారాబం చేస్తున్నావో నేనూ చూస్తాలే.'' ఇద్దరూ నవ్వుకున్నారు. శాంతమ్మగారు హడావిడిగా లేచి, ''ఎండగా ఉంది. కాసేపు పోయాక స్నానం చేద్దురుగాని అన్నయ్యా, పైకి వెళ్లి విశ్రాంతి తీసుకోండి'' అంది.

''ఇదుగో, వీడేదో హార్బరు చూపిస్తానంటున్నాడు. అది చూసి వస్తాం. త్వరగా బట్టలు మార్చుకుని రారా! పో!''

గోపాలం తల ఊపి మెట్లెక్కి పైకి వెళ్లాడు.

* * *

కె. జి. హెచ్. స్పెషల్‌వార్డులో పచార్లు మొదలెట్టాడు గోపాలం.

''అమ్మా...సీతమ్మతల్లీ . . . అరేయి, హార్బరుకి తీసుకువెళతావనుకున్నానుగాని ఇలా హాస్పిటలుకి తీసుకువస్తావనుకోలేదురా, నాయనా ... అమ్మా ... రామయ్యతండ్రీ ... అనాథరక్షకా? ... ''

తండ్రివంక జాలిగా చూశాడు గోపాలం. ''ఇంటికి టెలిగ్రాం ఇస్తాను, నాన్నా. అమ్మ వస్తుంది.''

''ఏడిశావ్, వెధవా. ఇదంతా చాలక దాన్నికూడా కంగారుపెడదామనా ఏమిటి? అది సరేగాని, ఒరేయ్, ఇంతకీ ఎన్నాళ్లీ దిక్కుమాలినచోట పడిఉండాలిట, అదేమన్నా కనుక్కుని ఏడ్చావా అసలు?''

''మూడురోజులు పోయాక కట్లు విప్పుతారట. అందాకా ఉంటే చాలు. ఈ అవతారం మార్చుకుని





దీపావళి
పండుగ శుభవేళ
మా వాడకందార్లకు, డీలర్లకు, హితైషులకు, ఎల్లరకు
మా
హృదయపూర్వక శుభాకాంక్షలు
మేక మార్కు బీడీ ఉత్పత్తిదార్లు:
వి. అబ్దుల్ జబ్బార్ సాహిబ్ అండ్ సన్స్
79, మెయిన్ బజార్, వేలూరు, ఉ. ఆ.
(ద. ఇండియా)

వస్తాను, నాన్నా."

"ఏడిశావ్‌గాని కూర్చో. ఈ హాస్పిటల్లో నన్ను ఒక్కణ్ణీ వదిలి వెళ్లడానికి నీకు సిగ్గులేదుట్రా."

"పదినిమిషాల్లో వచ్చేస్తాను, నాన్నా. శాంతమ్మ అత్తయ్యగారినికూడా తీసుకువస్తాను."

"గారేమిటిరా నీ మొహం. దాన్ని, దాని కూతుర్ని ఓసారి ఇలా వచ్చి పొమ్మన్నానని చెప్పు. త్వరగా తగలడు."

"ఓకే, నాన్నా." పరిగెత్తినట్లు బయటపడ్డాడు గోపాలం.

• • •

అరగంట తరవాత శాంతమ్మగారు దశరథంగారికి పళ్లరసం తాగిస్తూ, "స్కూటర్‌మీదనించి పడ్డారంటే హడిలి చచ్చాను. దేవుడు చల్లగా చూసి పెద్ద దెబ్బలేం తగల్లేదు. కాలిదెబ్బ నాలుగురోజుల్లో అదే పోతుంది. అయినా, అబ్బాయ్, సరిగ్గా ఆ బండి తోలడం నేర్చుకోకుండా నాన్నని ఎక్కించవచ్చా, తప్పు కాదూ?" అంది గోపాలాన్ని మందలిస్తూ.

"అది కాదత్తయ్యా. లారీ సడన్‌గా వచ్చేసరికి నాన్నే అనవసరంగా కంగారుపడ్డాడు. లేకపోతే పడే వాళ్లం కాదు."

"ఏడిశావ్‌లేరా . . . ఏమమ్మా, అమ్మాయి ఇంకా రాలేదా ... హమ్మా ... రామయ్యతండ్రీ."

"ఈపాటికి వచ్చి ఉంటుంది. తాళంచెవి నా దగ్గిరే తగలడింది. వంటకూడా ఒకటి చూసుకోవాలిగా. నేను వెళ్లి అమ్మాయిని పంపిస్తాను, అన్నయ్యా."

• • • •

కారియర్‌లో అన్నం పట్టుకువచ్చింది దమయంతి. గోపాలం ఇబ్బందిగా లేచి గది బైటకివచ్చి నిలుచున్నాడు. అయిదు నిమిషాలు పోయేసరికి విసుగెత్తిలోనికి వెళ్లాడు. దమయంతి ఓసారి అతని కళ్లలోకి చూసి దశరథంగారు చెప్పేమాటలకి ఊకొడుతూంది.

"అప్పుడు నువ్వు ఇంత ఉండేదానివి. 'పాపా, ఒక ముద్దుపెట్టు అంటే ఛీ, నీ మీసాలు గుచ్చుకుంటాయి' అనేదానివి!" అంటున్నారు దశరథంగారు తెల్లని మీసాలు గర్వంగా నిమురుకుంటూ.

"నాన్నా, ఒక పావుగంటలో వస్తాను."

"ఎక్కడికిరా?"

"హోటలుకి పోయి వస్తాను. ఆకలి వేస్తూంది."

దమయంతి గోపాలంకేసి చూడకుండా, "అమ్మ ఆయన్ని భోజనానికి ఇంటికి తీసుకురమ్మని చెప్పమంది మామయ్యా" అంది.

"అది సరేకాని, ఆయనేమిటి ఆయన. వాడు నీ బావయితేనూ. మీ అత్తయ్య పెళ్లికాకముందు ఏరా, బావా అనేది నన్ను. తెలుసా?"

దమయంతి గోపాలంకేసి చూసి దశరథంగారికేసి తిరిగి, "బావకి స్కూటర్ కొనివ్వకుండా ఉండవలిసింది" అంది నవ్వుముఖంతో.

గోపాలం దమయంతిని మింగేసేలా చూసి, "నాన్నా, నేను వెళుతున్నాను" అన్నాడు అసహనంగా.

దశరథంగారు భోజనం పూర్తిచేసి, "లారీలవీ ఉంటాయి జాగ్రత్తగా వెళ్లిరండి" అన్నారు.

దమయంతి కారియరు సర్దుకుని గోపాలంతో కలిసి హాస్పిటల్ బైటికి వచ్చింది. స్కూటర్ తాళం తీస్తూ గోపాలం, "మీరు రిక్షా చేసుకుని ఇంటికి వెళ్లండి. నే నేదైనా హోటల్లో భోంచేసి నాన్నదగ్గిరికి వెళతాను" అన్నాడు.

దమయంతి అతని దగ్గిరికి వచ్చి, "ఆ హోటలు పాటి చేయదా మా ఇల్లు?" అంది.

"నే నామాట అనలేదు. ఇంక మీరు వెళ్లండి."

దమయంతి ఓసారి అతన్ని చూసి దూరంగా రెండడుగులు వేసి చటుక్కున వెనక్కి తిరిగివచ్చి అతని చేయి పట్టుకుని, "నాకు తెలుసు. నీకు నామీద కోపం వచ్చింది కదూ?" అంది.

"ఎంతమాట! కోపం వచ్చి తిట్టినా, చెప్పుదెబ్బలు కొట్టినా అవి ఆడవాళ్లకే చెల్లాయి. దయచేసి నాచేయి వదలండి."

దమయంతి నీళ్లు తిరుగుతున్న కళ్లతో, "నేనేం కావాలని చెయ్యలేదు. వాళ్లిద్దరూ నా వెంటపడి గొడవచేస్తూంటే . . . " అంది.

"చంపివేయకపోయారూ! మిమ్మల్ని సాధన అన్నాడని ఆ రాజుని అంతమందిలో చివాట్లు పెడతారా? ఆఫ్టరాల్ మిమ్మల్ని ప్రేమించిన పాపానికి ఆ రామారావుని చెప్పుదెబ్బలతో చావకొడతారా? మీకు తెలియదేమో, ఈ సృష్టిలో ప్రతి ప్రాణికీ ప్రేమించే హక్కుంది. మీకిష్టం లేకపోతే ఇష్టం లేదని చెప్పవచ్చు. వాళ్లని చూసి జాలిపడవచ్చు. అంతేకాని అలా చెప్పుదెబ్బలు కొట్టే అధికారం మీకు లేదు, మిస్ దమయంతి. ఇక వెళ్లండి మీరు."

దమయంతి చిన్నగా నవ్వి, "ఇప్పుడు తెలిసింది, మా బావకు నామీద ఎందుకింత కోపమో. అయామ్ సో సారీ. బావా. వాళ్లు నీ ఫ్రెండ్సని నాకు తెలియదు. పోనీ, బావా, వాళ్లని మనింటికి తీసుకురా. క్షమాపణలు కోరుకుంటాను" అంది.

గోపాలం నమ్మలేనట్లు దమయంతిని చూసి, "యూనివర్సిటీ కంతటికీ అందగత్తెనని నీకు గర్వం ఎక్కువ. నువ్వు వాళ్లని క్షమాపణలు కోరుకుంటావా? తీరా వాళ్లని తీసుకువచ్చాక ఆ అమాయకుల్ని మరింత బాధపెట్టి పంపుతావు" అన్నాడు.

దమయంతి గోపాలాన్ని కోపంగా చూసి, "నమ్మితే నమ్ము, లేకపోతేలేదు. ఇంతకీ ఇంటికి వస్తావా, రావా?" అడిగింది.

గోపాలం కొద్దిగా ఆలోచించి, "సరే,పద. నీ ముఖం చూసి రావాలని లేకపోయినా, అత్తయ్య బాధపడుతుందని వస్తున్నాను. వెనకాల తగలడు" అన్నాడు స్టార్టుచేస్తూ.

దమయంతికి ఆ చిల్లగింపుతో ఉక్రోషం ముంచుకు వచ్చింది. నీళ్లు తిరుగుతున్న కళ్లతో స్కూటరుమీద వెనకాల కూర్చుంది. ఇంటికి ఎలా వచ్చారోకూడా ఆమెకి తెలియదు. దిగి తన గదిలోకి పోయి మంచంమీద బోర్లా పడుకుంది.

నాలుగురోజులు గడిచాయి. దశరథంగారు ఊరికి వెళ్లిపోయారు. కాలేజీకి సెలవుపెట్టి ఈ నాలుగు రోజుల్లో చాలాభాగం గోపాలం హాస్పిటల్లోనే ఏదో ఒక నవల ముందువేసుకుని గడిపాడు. ఇంట్లోఉన్న సమయంలోకూడా దమయంతి అతనికి కనిపించలేదు. దశరథంగారు వెళ్లిన మరునాడు కాలేజీకి వెళ్లాడు గోపాలం. అతనికి చిత్రమైన వార్తలు తెలిశాయి, శేషగిరి అసలు క్లాసులకే రావడంలేదని, రామారావు, రాజులు హాస్టలు డిస్పెన్సరీలో చేరారనీను. క్లాసు వదిలిపెట్టాక హాస్టలుకు వెళ్లాడు గోపాలం. శేషగిరి గది చీకటిగా ఉంది. ఆ చీకటిలోంచి "ఎవరు?" అన్న స్వరం హీనంగా వినపడింది. కిటికీ తలుపులు తీశాడు గోపాలం. దుప్పటి మెడదాకా కప్పుకుని మాసిన గడ్డంతో కనిపించాడు శేషగిరి.

దగ్గిరికి వెళ్లి నుదుట చెయ్యి వేశాడు గోపాలం. చల్లగానే ఉంది. గట్టిగా నిట్టూర్చి అడిగాడు: "ఏమయింది? అలా ఉన్నావు. అన్నం తింటున్నావా?"

"ఆఁ."

"క్లాసులకి వెళుతున్నావా?"

"లేదు."

"సినిమాలకి . . . ?"

"వెళ్లి నెల దాటింది."

"ఏం చేస్తున్నావు?"

"పడుకుంటున్నాను."

"ఎన్నాళ్లబట్టి?"

"వారంరోజులబట్టీ."

"మీ రూమ్మేటు ఏమయ్యాడు?"

"ఊరెళ్లాడు. వడుగట."

గోపాలం లాలనగా చూసి అతనిపక్కన కూర్చుని లాలనగా జుట్టు నిమురుతూ అడిగాడు: "అరేయ్, ఏమిట్రా ఇది? సంగతి చెప్పు. ఎవరన్నా ఏమన్నా అన్నారా?"

"అన్నారు."

"ఎవరు?"

"అనార్కలీ."

"అనార్కలీనా? రేయ్, తంతాను."

"వద్దు . . . చంపు."

"అరేయ్, ఏమిట్రా ఇది? నిజం చెప్పరా? అనార్కలీ ఎవరు?"

"మీరంతా దమయంతి అనే ఆవిడ."

"ఏమంది?"

"సలీమ్ ఎవరని అడిగింది."

"సరే, వస్తాను." నవ్వి లేచాడు గోపాలం. శేషగిరి దిగులుగా చూశాడు.

"రేపు పొద్దున ఎనిమిదింటికి వస్తాను. ఇలానే పడుకుని మూలుగుతూఉండు. నీకు శుభమవుతుంది."

"నిజంగా?"

"అనార్కలీమీద ఒట్టు." నవ్వి బైటికి వచ్చాడు గోపాలం. కాసేపటికి స్కూటరు డిస్పెన్సరీముందు ఆగింది.

ఉన్న అరడజను బెడ్సులలోనూ నాలుగు ఖాళీగానే ఉన్నాయి.

రామారావు కళ్లు విప్పి నీరసంగా నవ్వాడు. "నువ్వా, గురూ, కూర్చో."

"ఏమయింది? జ్వరమా?"

"అన్నం సహించడంలేదన్నాను. నిద్ర పట్టడం లేదన్నాను. చచ్చిపోతానేమోనని అన్నాను. నోరు తెరవమన్నాడు డాక్టరు. తరవాత ఎడ్మిట్ అని ఎర్రటక్షరాలతో వ్రాశాడు."

"టెంపరేచరెంత?"



iam MH.10 TL

"బిలో నార్మల్. రోజుకో పాయింటు తగ్గుతూంది. బహుశా ఇంకో పధ్నాలుగురోజులకి చచ్చిపోతాను." తాపీగా చెప్పాడు రామారావు.

"అన్నం తింటున్నావా?"

"ముందే చెప్పాగా. రొట్టె పాలూ పళ్ళూ నర్సు తెస్తున్నారు. అప్పుడప్పుడు కాంటీన్‌నించి ఫలహారం కాఫీ తెప్పించుకుంటున్నాను."

ఆశ్చర్యంగా చూశాడు గోపాలం. "మందులేం ఇస్తున్నారు?"

"అవేవో కొత్తరకం మందులు కాబోలు! చాకలెట్లలా ఉన్నాయి."

"ఆయనా ఇంతేనా?"

"ఎవరు, రాజా? అతనింత సీరియస్‌కాదు. అన్నం తింటున్నాడు. మిగతాదంతా మనకు డిటో. మిస్టర్ రాజా, మన గోపాలం వచ్చాడు. లెండి."

"హలో." రాజా కళ్ళు తెరిచి దిగులుగా నవ్వాడు గోపాలాన్ని చూసి.

"హలో. ఎలా ఉన్నారు?" దగ్గిరికి వెళ్ళాడు గోపాలం.

"ఏదో ఇలా ఉన్నానులెండి. వెధవప్రాణం పోవడం లేదు, ఎన్ని కాఫీలు సిగిరెట్లు తాగినా."

"గురూ, మాట."

వెనక్కి తిరిగాడు గోపాలం రామారావుకేసి.

"అదీకాక ఆయనదీ మనలాంటి కేసే అని తేలింది. ఇలా ఉండి ఉండి కొన్నాళ్ళకి మేమిద్దరం చచ్చిపోయాక దమయంతిని వచ్చి ఓ కన్నీటిబొట్టు రాల్చమన్నామని చెప్పు. మా కింత ఆత్మశాంతి కలిగించినదవుతుంది. మరోమాట. మేమిలా చచ్చిపోతున్న సంగతి ఏ విలేఖరికీ చెప్పమాకు. మా ఫొటోలు పేపర్లో వేస్తానంటాడు. అవి చూసి మేం బ్రతికిఉండగానే దమయంతి ఇక్కడికి రావచ్చు. అది మా కిష్టంలేదు." కళ్ళు మూసుకున్నాడు రామారావు.

"మేం చనిపోయాక ఒక రచయితని తీసుకువచ్చి మేమే వ్రాసినట్లు మా ఆత్మకథలు వ్రాయించి మేగజైను కమిటీ కివ్వండి. అవి చదివి ఈ యూనివర్శిటీలో స్త్రీజనం దమయంతిని ఆదర్శంగా పెట్టుకోకుండెదరుగాక!" కళ్ళు మూసుకున్నాడు రాజా.

గోపాలం వాళ్ళిద్దరివంకా చూసి బైటికి వచ్చాడు. ఓ నర్సు చేతినిండా బత్తాయిపళ్లతో ఎదురు వచ్చాడు.

"ఇదుగో, మాట. వీళ్ళిద్దరినీ డాక్టరుగారే ఎడ్మిట్ చేశారా?" అడిగాడు గోపాలం.

"అఁ. డిస్పెన్సరీ ఖాళీగానే ఉందిగా. ఈ సీజన్‌లో రోగాలు తక్కువలెండి. అయితే డాక్టరుగారు ఓ ఆలోచనలో ఉన్నారు." చెప్పాడు నర్సు.

"ఏమాలోచన?"

"ఎవరికీ చెప్పమాకండి. వీళ్ళిద్దరినీ రేపో ఎల్లుండో పిచ్చాసుపత్రికి బదిలీచేయించా లనుకుంటున్నారు. అయితే వీళ్లకి పిచ్చి ఉన్నట్లు ఆయనకీ సరిగ్గా నిర్ధారణ కాలేదనుకోండి."

"వస్తాను." స్కూటరుదగ్గిరికి పరిగెత్తాడు గోపాలం.

● ● ● ●

"అత్తయ్యా, దమయంతి ఏం చేస్తోంది?"

పెరుగు కలుపుకుంటూ అడిగాడు రామారావు.

"గదిలో పడుకుంది కాబోలు బాబూ."

"ఏడింటికి నిద్రేమిటి అత్తయ్యా."

"ఏవిటో బాబూ, దాని ధోరణి ఈ మధ్యన అదోలా ఉంది. అడిగితే చెబితేనా? అసలు దానికి ఈమధ్య నేనంటే లక్ష్యమే పోయింది."

"అత్తయ్యా, పక్కవీధి రామాలయం దగ్గిర మంచి హరికథ చెబుతున్నారుట."

"అవును, బాబూ పక్కింటి సీతమ్మత్త చెప్పింది. కాని ఏది, తీరుబడి అయి ఛస్తేనా ఈ ఇంట్లో."

"భోంచేసి వెళ్ళు అత్తయ్యా!"

"ఏది రాణిగారు భోంచేస్తేనా. ఇందాకా అడిగితే ఆకలి లేదంది. ఏ తొమ్మిదింటికోగాని తినదు కాబోలు."

"తను పెట్టుకు తింటుందిలే. నువ్వు భోంచేసి వెళ్ళు అత్తయ్యా."

"సరిసరి. ఎవరూ గుర్తు చెయ్యకపోతే కుంభ కర్ణుడిలా అలానే నిద్ర పోతుంది. దానికి ఆరోగ్యం అంటే లెక్క ఉంటేనా? ఒకసారి ఏమయింది అనుకున్నావ్—"

"నేను గుర్తు చేస్తాలే అత్తయ్యా. నువ్వు వెళ్ళు." చేతులు కడుక్కున్నాడు రామారావు.

శాంతమ్మ కొంచెం ఆశ్చర్యపడి చిన్నగా నవ్వుతూ గోపాలాన్ని చూసి, "సర్లే అయ్యా వెళ్ళు." అంది. అరగంట తరవాత పైకివచ్చి అతనితో వెళుతున్నానని చెప్పి శాంతమ్మగారు హరికథకి పక్కింటావిడతో కలిసి వెళ్ళింది. గోపాలం కిందికి వచ్చి దమయంతి గదిలోకి వెళ్ళి లైటు వేశాడు. దమయంతి బద్ధకంగా తలతిప్పి కళ్ళు చిట్లించి అతన్ని ప్రశ్నార్థకంగా చూసింది.

"రా, అన్నం తిందువుగాని. ఎంతసేపు నిద్ర పోతావు అలా?"

దమయంతి కొంచెం ఆశ్చర్యంగా అతన్ని చూసి తిరిగి దిండుమీద తలవాల్చి కళ్ళు మూసుకుంది. రామారావు ఆమె తల దగ్గిర కూర్చుని ఆమె పెదవుల మీద వేలితో రాస్తూ, "నన్ను చంపెయ్యాలన్నంత కోపంగా ఉంది కదూ నీకు?" అన్నాడు. ఆమె మాట్లాడలేదు. గోపాలం ఆమె పక్కన పడుకుని ఆమెని మీదికి లాక్కుని జుట్టు నిమురుతూ, "పోనీ నేనే చచ్చిపోతానులే. ఆఖరిసారి ఒక్కసారి నాకేసి చూడవా?" అన్నాడు. దమయంతి మొహం అతని ఛాతీమీదనించి తీయలేదు. ఆమె వీపు అదిరి అదిరి పడుతూంది. ఆమె ఏడుస్తూందని గ్రహించాడు గోపాలం.

* * *

తెల్లారింది. చప్పుడుకి కళ్ళు తెరిచిన శేషగిరి గోపాలం వెంటఉన్న దమయంతిని చూసి ఉలిక్కిపడి వణికిపోతూ దుప్పటి తల నిండుగా ముసుగు పెట్టుకున్నాడు.

దమయంతి ఓ కుర్చీ శేషగిరి మంచం దగ్గిర వేసుకుని కూర్చుని దుప్పటీ గట్టిగా పట్టుకుని శేషగిరి వేళ్లని మృదువుగా తొలగించి దుప్పటి కిందికి లాగింది.

శేషగిరి కళ్ళు తెరిచి భయంగా చూశాడు.

నవ్వింది దమయంతి. "వ్యవసాయం చేసుకుంటానన్నారటగా."

"అన్నాను. . . .అనలేదు. అనలేదు."


నిశ్చింతగా వంట చేసుకోవడానికి ఎక్కువమంది గృహిణులు

కాల్‌గ్యాస్‌ను

వుపయోగిస్తున్నారు




వంట గదిలో కాల్‌గ్యాసును యేర్పాటు చేసుకొని వంట ఎంత హాయిగా సాగుతుందో తెలుసుకోండి. కాల్‌గ్యాస్‌ను వాడటం ఎంతో సుళువు...ఒక క్షణంలో వెలుగుతుంది... మీ వంట చేసే కాలాన్ని కొన్ని గంటల కాలము దాకా తగ్గించుతూ శ్రమయే లేదని చేస్తుంది...దానితో ఖర్చు ఎంతో తక్కువ కూడా. కాల్‌గ్యాస్ పరిశుభ్రమైనది... మసికాదు... పొగరాదు. పాత్రలను కడుగుకొనే బాధలుండవు.

కాల్‌గ్యాస్ నిరపాయకరమైనది...

కాల్‌గ్యాస్ ప్రత్యేకమైన సేఫ్టీ హ్యాట్స్ తోపాటువుండే ఉక్కు సిలిండర్లలో భద్రముగా మీకు లభిస్తుంది. అందువలన కారటము మరియు అపకతవక వాడటం వుండదు.

ఇంటికివచ్చియిచ్చు సర్వీసుకలదు

పోల డిస్ట్రిబ్యూటర్సు: ఈస్టుకోస్టు గ్యాస్ కంపెనీ
48-9-5 కోఆపరేటివ్ కాలనీ, ద్వారకా నగర్
విశాఖపట్టణము-4 ఫోను 3516
కెన్నెమరా ఎనెక్సి, మౌంట్ రోడ్, మద్రాసు 2 ఫోను 83428

ఏజెంట్లుగల స్థలములు: మద్రాసు.. కాకినాడ, విశాఖపట్టణము, విజయవాడ, ఏలూరు, గుంటూరు. పాలకొల్లు, రాజమండ్రి, నెల్లూరు, విజయనగరం, మచిలీపట్టణము, సేలం, కాట్పాడి, ఒంగోలు, వరంగల్, పాండిచేరి, కాంచీపురం, కర్నూలు, చిత్తూరు, తిరుపతి, బొబ్బిలి, పార్వతీపురం, రామచంద్రపురం, సోంపేట, నర్సరావుపేట,


ఒక కాల్టెక్స్ ఉత్పత్తి

ఉచితము!

అమూల్
బేబీ పుస్తకము

అమూల్ బేబీ పుస్తకము ఇప్పుడు ఉచితంగా తల్లులకు ఇవ్వబడుతుంది. గర్భధారణ, ప్రసవానికి ముందర జాగ్రత్త, ప్రసవము, తల్లి పాలు, ఇతర ఆహారములు, మిశ్రమ ఆహారమును అలవాటు చేయుట, పిల్లవాని దినచర్య, పిల్లవాని అభివృద్ధి, జబ్బులను అరికట్టుట, ప్రథమ చికిత్స, పసితనమందలి సాధారణ రోగములు మరియు జబ్బుతో నున్న పిల్లవాని యొక్క సంరక్షణను గురించి వాస్తవికమైన అధ్యాయములు గల ఈ 48 పేజీల పుస్తకము సులభశైలిలో అగ్రగణ్యుడైన ఒక స్పెషలిస్టుచే వ్రాయబడినది.

ఈ క్రింది కూపన్‌ను నింపి
పోస్ట్ బ్యాగ్ 10124,
బొంబాయి-1కు,
ఖర్చుల నిమిత్తమై
50 పైసల స్టాంపులతో పంపండి.



పోస్టు బ్యాగ్ 10124కు, బొంబాయి-1
తెలుగులో వ్రాయబడిన అమూల్ బేబీ పుస్తకము యొక్క ప్రతిని ఉచితంగా నాకు పంపండి

స్పష్టమైన పెద్ద అక్షరములలో పేరు మరియు అడ్రెస్

TL 102

ASP/ABF/83 TEL

"చదువుకోరూ మరి?"

"చదువుకుంటాను."

"దమయంతి ఎవరు? అనార్కలీయా?" అడిగింది నవ్వుతూ.

"అవును. కాదు."

"సరే మా సలీమ్ బావ ఇడుగోండి. మారు పేరుతో మా బావ వ్రాసిన కథలు మీరు చదివే ఉంటారు పత్రికల్లో."

"కథలు. . గోపాలం బావ. సలీమ్! . . ." గట్టిగా అరిచి ముఖం ఒక పక్కకు వాల్చేశాడు శేషగిరి. గోపాలం గాభరాగా కూజాలోంచి కాసిని నీళ్ళు తీసుకుని అతని ముఖంమీద చల్లాడు.

కళ్ళు విప్పిన శేషగిరికి గోపాలం సానుభూతి వదనం కనిపించింది.

"శేషూ."

"గోపీ." లేచి కూర్చుని ఒక్కసారి చేతులు చాచి గట్టిగా కౌగిలించుకున్నాడు గోపాలాన్ని. తరవాత ఇద్దరూ కళ్ళు తుడుచుకున్నారు.

"ఆనాడు 'అనార్కలీ పక్కన అరటిమొక్క' అన్నది నేనే. చేసిన తప్పు చెబితే పోతుంది" అన్నాడు శేషగిరి తలవంచుకుని.

"పాపం పిచ్చిపిల్ల. రమ ఎంత బాధ పడిందని. నన్ను అనార్కలీ అన్నారని కాదు. దాన్ని ఏడిపించారే అనే ఆరోజు నాకంత కోపం వచ్చింది?"

"సలీమ్ ఎవరని మీరంటూంటే అర్థం చేసుకోలేక పోయాం. వీడు కథలు వ్రాస్తాడని తెలుసన్నమాటేగాని తన పెన్‌నేమ్ ఇదని ఎప్పుడన్నా చెప్పి ఛస్తేనా వీడు? ఆ రమ ఎక్కడ ఉంటారో చెప్పండి. వెళ్ళి క్షమాపణలు — "

"ఎల్లమ్మతోట దగ్గిర బస్సుదిగి తూర్పుగా వెళ్ళే సందులోకి వెళ్ళండి. కుడిపక్కన ఓ పసుపుపచ్చ డాబా కనిపిస్తుంది. డాబాపైన ఒకటే గది. అందులో సాయంత్రం ఆరింటికి మీకు కనిపించగలదు రమ. పదబావా." బైటికి నడిచింది దమయంతి. వెళ్ళి వస్తానని సంజ్ఞ చేసి గోపాలం ఆమెవెంట బైటమెట్లు దిగుతూ అడిగాడు. "ఈ సలీమ్ ఎవరు? నేనా పేరుతో ఎప్పుడు కథలు వ్రాయలేదే?"

దమయంతి అతన్ని వెక్కిరింపుగా చూసి, "వాళ్ళు నన్ను అనార్కలీ అన్నారు. నువ్వేమవుతావేమిటి దుర్మార్గుడా?" అంది.

"నేను దుర్మార్గుడినా?"

"కాకపోతే రాత్రి నీకెంత ధైర్యం?"

"నేను నీ మేనత్త కొడుకుని. రెండక్షరాలలో చెప్పాలంటే బావని." నవ్వాడు గోపాలం.

దమయంతి అతన్ని మోచేత్తో పొడిచి, "ఇష్" అంది. కొందరు స్టూడెంట్లు వాళ్ళని దాటి వెళ్ళారు. గోపాలం స్కూటరు స్టార్టు చేశాడు. దమయంతి ఎక్కి కూర్చుని, "నెక్స్టు ప్రోగ్రాం ఏమిటి?" అడిగింది.

"ఇంకా ఇద్దరు ఉన్నారుగా."

"రాజా, రామారావుగారలా. ఎక్కడున్నారు?"

"డిస్పెన్సరీలో."

"గుడ్‌గాడ్. ఏమయింది?"

గోపాలం నవ్వి, "మజ్నూలాగ మారారు. చచ్చి

పోతారట" అన్నాడు స్కూటరు డిస్పెన్సరీ ముందు ఆపుతూ.

దమయంతి రాజు మంచం ప్రక్కన స్టూలుమీద కూర్చుని వణికిపోతూ చూస్తున్న రాజుని చూసి నవ్వుతూ, "గోపాలం మా బావ" అంది.

"వాట్!" ఎగిరి కూర్చున్నాడు రాజు. రామారావు కూడా ఒక్క ఉదుటున లేచి రాజు పక్కన వచ్చి కూర్చున్నాడు. తరవాత ఇద్దరూ గోపాలంకేసి చూశారు. గోపాలం ఓసారి కళ్ళు మూసుకుని తెరిచి వాళ్ళిద్దరి వంకా చూసి ఇలా అన్నాడు. "దేవుడిమీద ప్రమాణం చేసి సత్యప్రమాణంగా నిజమే చెబుతాను. అబద్ధం చెప్పను. షుమారు పదిరోజులక్రిందట ఈ ఇద్దరు వాదులు నా దగ్గరకివచ్చి కేసు గెలిపించమన్నమాట వాస్తవమే. ప్రతివాది దమయంతి, జడ్జి శాంతమ్మత్తయ్యగారూ నాకు సహకరించని మాట వాస్తవమే. ఇది పచ్చినిజం. నా కళ్ళ ఎదట రెండు కేసులూ ఇలా కొట్టివేయబడటం ఎంత శోచనీయం? మండు వేసవిలో మంచిగంధం పూసినట్లు, మొదటి రోజు మాట్నీకి టికెట్లు దొరకనట్లు మీ ఇద్దరి నిరాశామయ జీవితాలకి శాంతి కావాలంటే, మీ జీవనం బృందావనం కావాలంటే తక్షణం ఈ డిస్పెన్సరీకి గుడ్‌బై చెప్పి ఎల్లమ్మతోట దగ్గర బస్సుదిగి తూర్పు వేపునున్న సందులోని కుడిచేతివేపు పసుపుపచ్చ డాబాలో రేపు పగలు పన్నెండుగంటలకు జరుగు అధికాహార విందుకి హాజరు కాగలరు."

దమయంతి వాళ్ళిద్దరిని దిగులుగా చూసి, "మీరిద్దరూ నన్ను ప్రేమిస్తున్నారు కదూ?" అడిగింది.

రామారావు కళ్ళు తుడుచుకుని, "ఇదివరకటికన్న ఎక్కువగా ప్రేమిస్తాం. నువ్వు మా ప్రియమైన చెల్లాయివి" అన్నాడు.

"అవును సిస్టర్" అన్నాడు రాజు.

దమయంతి మొహం విప్పారింది. "మంచి అన్నయ్యలు. అయితే తప్పకుండా రేపు పార్టీకి వస్తారుగా?"

"వస్తాం" అన్నారిద్దరూ లేచి నించుని.

* * *

శాంతమ్మగారు కళ్ళజోడు తీసి తీవిగా చూశారు. "నువ్వేనా శేషు అంటే?"

"అవునండి." శేషగిరి జవాబు.

"పైకి వెళ్ళు. మళ్ళా అనక కనిపించు. పో."

తల ఊపి మెట్లెక్కి డాబాపైకి వచ్చి గది గుమ్మం ముందు తలవంచుకుని నిలబడ్డాడు శేషగిరి. ఇంటర్వ్యూలో అభ్యర్థిలా ఉంది అతని పరిస్థితి.

"రావచ్చు." స్త్రీగొంతు.

తల ఎత్తిన శేషగిరికి కనిపించిన రమ ఈసారి అంత అనాకారంగా కనిపించలేదు. కొంచెం లావన్నమాటేగాని ఎంత అసభ్యంగా అన్నాడు తనారోజు, 'అనార్కలీ ప్రక్కన అరటిమొక్క' అని! లోనికి వెళ్ళి దిగులుగా చూసి ఏదో చెప్పబోయాడు.

"కూర్చోండి."

"నన్ను . . . నన్ను . . ఎక్స్ . . . క్షమించండి." తల వంచుకున్నాడు.

రమ రెండుక్షణాలు అతన్ని చూసి ఫ్లాస్కులోంచి కప్పులోకి కాఫీ పోసి అతనిముందు పెట్టి, "తీసుకోండి" అంది.



నారాయుడివేళ ఏల రాడాయె! చిత్రం—జి. లక్ష్మణరావు (మదరాసు–12)

శేషగిరికి ఆమె ప్రవర్తన వింతగా ఉన్నా కిక్కురుమనకుండా కాఫీ అంతా గబగబా తాగేశాడు. తల ఎత్తడంలేదు.

రమ లేచి కాసేపు అటూ ఇటూ పచార్లుచేసి అతని దగ్గర్లోఉన్న కుర్చీలో కూర్చుని, "ఎందుకు క్షమించమని అడిగారు?" అంది శైలిలోకి అతన్ని తెస్తూ.

శేషగిరి తలఎత్తి ఒక్కక్షణం ఆమె కళ్ళలోకి చూసి తల దించుకుని, "ఆ రోజు మిమ్మల్ని అలా అన్నందుకు. చాలా ఫూలిష్‌గా ప్రవర్తించానావేళ" అన్నాడు.

"ఆ రోజు ఏమన్నారు మీరు?"

"ఉహూ." సిగ్గు పడుతున్నాడతను. "మిమ్మల్ని ఎంత బాధ పెట్టానో. ." అతని గొంతు బొంగురుపోతూంది.

"అవును." నెమ్మదిగా చెప్పింది రమ. "బాధ వేసింది. అంతమందిలో అన్నందుకు . . . మీ గొంతు గుర్తుపట్టినా . . ."

"అప్పుడు తెలుసుకోలేకపోయాను."

"ఇప్పుడేం తెలుసుకున్నారు?" కొంటెగా చూసింది రమ.

"మీరే..మీరే.. అనార్కలీ నిజానికి."

"ఎప్పటినించి?" నవ్వుతూంది. ఆమె కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి.

"నిజం. . .నన్ను నమ్మరూ?" దిగులుగా చూశాడు శేషగిరి.

రమ కళ్ళు తుడుచుకుని మెరిసే కళ్ళతో అతన్ని చూసి ఏదో చెప్పబోయే అంతలో దమయంతి లోనికి వచ్చి, "ఇక చాల్లేరా. మీ గొడవ పాడుగాను. సినిమాల్లోలా మీరూ, మీ డైలాగులూ. పదండి ఏదన్నా సినిమాకి పోదాం" అంది.

"సినిమాకా? వెరీగుడ్. దానితోపాటు హోటల్లో చిన్న పార్టీ కూడ ఇస్తాడిప్పుడు మనకి శేషు" అన్నాడు గోపాలం లోనికి వస్తూ.

"ఏ సినిమాకి వెళదాం?" అడిగాడు శేషగిరి.

"దమయంతీ స్వయంవరం." వెక్కిరించింది రమ దమయంతివంక నవ్వుతూ చూసి.

దమయంతి రెండుక్షణాలు సిగ్గుపడి, "నోరు మూసుకో. ఓ అరటిమొక్క." అంది. అంతా నవ్వుకున్నారు.

★